ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 14 అక్టోబరు 2024 | 5





దసరా సంబరం

● అమలాపురంలో అంబరాన్నంటిన వేడుకలు ● ఆకట్టుకున్న చెడీతాలింఖానా ● అబ్బురపరిచిన విన్యాసాలు



అమలాపురంలో చెడీ తాలింఖానాలో భాగంగా అగ్గిబరాటాలు తిప్పుతున్న యువకులు



ఊరేగింపులో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్



అమలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాల్లో భాగంగా శనివారం రాత్రి జిల్లా కేంద్రమైన అమలాపురంలో శరన్నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేలాది మంది ప్రజలు ఈ ఉత్సవాలను తిలకించారు. బాజాభజంత్రీలు, బ్యాండుమేళాలు, గరగ నృత్యాలు, కోయడ్యాన్సులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో అమలాపురంలో జరిగిన చెడీతాలింఖానా ఉత్సవాలు అందరినీ అలరించాయి. ముఖ్యంగా వీధుల్లో చెడీ తాలింఖానాల విన్యాసాలు, కత్తులు, కర్రసాములు, అగ్గిబరాటాలతో జరిగిన విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలకు అమలాపురం పెట్టింది పేరు. దీనిలో భాగంగా అమలాపురం పట్టణంలోని వివిధ వీధుల్లో ప్రదర్శనలతో కిక్కిరిసిపోయాయి. మహిపాలవీధిలోని హంస వాహనాలు, గండువీధిలోని శ్రీశేషశయన, నల్లా వీధి విజయదుర్గ, రవణంవీధి మహిషాసురమర్ధిని, రవణం మల్లయ్యవీధి గరుడ విష్ణు, కొంకాపల్లి ఏనుగు, హంస, శ్రీరామపురం వాహనాలు పురవీధుల్లో ఊరేగాయి. ఈ వాహనాల ముందు ఆయా వీధుల్లో యువతీ యువకులతో పాటు చెడీ తాలింఖానాలో ప్రావీణ్యత కలిగిన వ్యక్తులు నిర్వహించే కర్ర, కత్తిసాములు, అగ్గిబరాటాల విన్యాసాలతో పాటు కళ్లకు గంతలు కట్టుకుని పొట్టపై కూరగాయలు, కొబ్బరికాయలను నరకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక అగ్గి బరాటాలు కూడా భారీ సంఖ్యలో తిప్పడం ఈ ఉత్సవాల ప్రత్యేకత. ఉభయ రాష్ట్రాల నుంచి అశేష ప్రజానీకం చెడీ తాలింఖానా ఉత్సవాలు తిలకించేందుకు తరలివచ్చింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో 600 మంది పోలీసులు భద్రతా చర్యలు చేపట్టి ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో సహ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా..



ద్రాక్షారామ, అక్టోబరు 13: భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. 10వ రోజు మాణిక్యాంబ అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాణిక్యాంబ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాణిక్యాంబ అమ్మవారికి ఉదయం లక్ష కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. మధ్యాహ్నాం 1 నుంచి 3.30 వరకు శ్రీచక్రనవావర్ణార్చన జరిగింది. 6 గంటలకు ప్రదోషకాలార్చన, దూపసేవ, పల్లకీ సేవ అనంతరం 6.30 గంటలకు భక్తులచే లక్ష కుంకుమార్చన సువర్ణ, రజత పుష్పార్చన అనంతరం సప్తహారతులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రాత్రి 7.05 గంటలకు వేగాయమ్మపేటలో శమీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్‌జేసీ పూజలు:

దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు కె.సుబ్బారావు స్వామివారిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని సాదర స్వాగతం పలికారు.

ఉద్యమమే.. ఊపిరిగా

హక్కుల పోరాట నేత సాయిబాబా కన్నుమూత

సన్నవిల్లి, అమలాపురంలో ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం

అనంతరం హైదరాబాద్‌కు పయనం

అమలాపురానికి చెందిన వసంతతో ప్రేమ వివాహం

జిల్లాలో పౌర హక్కుల సంఘాలు, వామపక్ష నేతల నివాళి



సాయిబాబా చదివిన హైస్కూల్

అమలాపురం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి, ఉద్యమాలతో ప్రభుత్వాలపై గళం విప్పే చైతన్య మూర్తి విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ గోకరకొండ సాయిబాబా. ఆయన శనివారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మృతిచెందారన్న వార్త కోనసీమ వాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అమలాపురంలో పుట్టిన సాయిబాబా గురించి తెలిసినవారెవరైనా ఆయన ఉద్యమ మార్గాన్ని కొనియాడుతున్నారు. ప్రజా హక్కుల కోసం నిరంతరం పోరాడే మహోన్నత వ్యక్తిగా ఆయనను కీర్తిస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసం వరకు అమలాపురంలోనే చేసిన ఆయన ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తిచేసి పౌర హక్కుల పోరాటాల్లో కీలకంగా మారారు. అటువంటి సాయిబాబా ఇక లేరన్న వార్తను కోనసీమ ప్రజలు జీర్ణించుకోలేపోతున్నారు. ఆయన పుట్టి పెరిగిన ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇప్పటికీ ఆయన నివాసం ఉండే వీధి, వారి అత్తవారిల్లు శిథిలస్థితికి చేరినప్పటికీ వాటిని చూసేందుకు కూడా ప్రజలు తరలివస్తున్నారు. సాయిబాబా మృతి పట్ల ప్రజా సంఘాలు కూడా దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపాలు తెలిపారు.

వైకల్యాన్ని జయించి..ఉద్యమ నేతగా..

ప్రముఖ రచయిత, విద్యావేత్త, మానవహక్కుల ఉద్యమనేత, ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గోకరకొండ సాయిబాబా(57) శనివారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతిచెందారు. అమలాపురం పట్టణంలో గాంధీనగర్‌లో ఓ పేదరైతు కుటుంబంలో 1967లో సాయిబాబా జన్మించారు. ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని ఆయన అమలాపురంలోని సెయింట్‌జాన్ హైస్కూల్‌లో టెన్త్ వరకు, ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తిచేశారు. ఐదేళ్ల వయసులోనే ఆయన వీల్‌ఛైర్‌కు పరిమితమయ్యారు. అమలాపురంలో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలోనే ఆయన వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. తర్వాత ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం(ఏఐఆర్‌పీఎఫ్)లో చేరారు. గాంధీనగర్‌లో నివాసం ఉండే సాయిబాబా అమలాపురం పట్టణంలోని మైపాల వీధికి చెందిన అరిగెల వసంతను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె మంజీల ఉన్నారు. కాలేజీ చదువుల సమయంలోనే కుటుంబమంతా హైదరాబాద్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వారి సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు సైతం హైదరాబాద్‌లోనే స్థిరపడడంతో గోకరకొండ సాయిబాబాకు సంబంధించిన సమాచారం ఇక్కడ పెద్దగా తెలియరాలేదు. వారికి సంబంధించిన దూరపు బంధువులు గోకరకొండ వంశీ అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి గ్రామంలో ఉన్నారు. సాయిబాబా మరణవార్త తెలుసుకున్న తర్వాత వారితో పాటు కొందరు ముఖ్యులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. అయితే సాయిబాబా వ్యక్తిత్వం, వారి కుటుంబం నేపథ్యం గురించి అమలాపురం పట్టణంలో ప్రజలంతా మంచిగానే చెబుతున్నారు. ఆయన మృతిపట్ల అమలాపురం పట్టణంలో పలు ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, వామపక్ష నేతలు ఘన నివాళులర్పించారు.



అమలాపురంలో శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీదేవి అమ్మవారు

జై దుర్గాభవాని

అమలాపురం టౌన్, అక్టోబరు 13: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా చివరిరోజున అమ్మవార్లు శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరిదేవిని, వేంకటేశ్వరదేవస్థానం ప్రాంగణంలోని శ్రీవైష్ణవికనకదుర్గమ్మను శ్రీరాజరాజేశ్వరిదేవిగా ప్రత్యేక అలంకారం చేశారు. అదే విధంగా శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారిని గునిశెట్టి వలీబాబా-వెంకటవిజయలక్ష్మి దంపతులు శ్రీరాజరాజేశ్వరిదేవిగా విశేష అలంకారం జరిపించారు. చక్కా రాజశేఖరరావు ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గమ్మను రాజరాజేశ్వరిదేవిగా అలంకరణ చేశారు.

చండీ మహాయాగం.. పూర్ణాహుతి..


దేవి శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా అమలాపురం శ్రీకామాక్షి పీఠంలో చండీయాగం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, చండీ మహాయాగం నిర్వహించారు. పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో గోవిందవర్ధుల దుర్గానాగేంద్ర భాస్కరశర్మ యాజ్ఞికంలో బాలబ్రహ్మచారి విఘనస రాజీప్రేమ్ చండీయాగాన్ని నిర్వహించారు. జాతీయ సమగ్రత, సర్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వశాంతిని కోరుతూ శరన్నవరాత్రులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రామచంద్రమూర్తి, దత్తాత్రేయప్రేమ్ పాల్గొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు గల్లంతు

డీజే సౌండ్‌కు కుప్పకూలిన యువకుడు

7లో

‘లిక్కర్’ లక్కీడ్రా నేడే



కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ఏర్పాట్లు



కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

103 మద్యం షాపులకు 4087 దరఖాస్తులు

మద్యం షాపులు వరించేది ఎవరినో?..


(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మద్యం షాపుల లక్కీడ్రా నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 133 మద్యం షాపులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 4087 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 81.74 కోట్లు ఆదాయంగా సమకూరింది. కలెక్టరేట్ గోదావరి భవన్‌లో దరఖాస్తు దారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ లాటరీ ద్వారా మద్యం షాపులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇందు కోసం కలెక్టరేట్‌లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ ఆదివారం కలెక్టరేట్‌లోని ఏర్పాట్లను పరిశీలించారు. నూతన మద్యం పాలసీ అమలుకు సంబంధించి ప్రతీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ప్రజల్లో గానీ, మద్యం వ్యాపారుల్లో గానీ ఎటువంటి అపోహలకు తావు లేకుండా జవాబుదారీతనంతో కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా జరగనుంది. ఈ లాటరీ విధానాన్ని వీడియోగ్రఫీ ద్వారా చిత్రీకరించడానికి ఎక్సైజ్‌శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ మద్యం లాటరీలో పాల్గొనే వ్యాపారులకు ఇప్పటికే కలెక్టరేట్ లక్కీడ్రాలో పాల్గొనేందుకు ఎంట్రీ పాస్‌లను కూడా మంజూరు చేశారు. మద్యం వ్యాపారులు తమ వ్యాపార భవితవ్యాన్ని సోమవారం జరిగే లక్కీడ్రా ద్వారా నిర్దేశితమవుతుంది. ఇందుకోసం భారీగా వ్యాపారులు సన్నద్ధమవుతున్నారు. భారీ భద్రత నడుమ లక్కీడ్రా నిర్వహణకు ఎక్సైజ్ శాఖ పూర్తిస్థాయి ఏర్పాట్లను సిద్ధం చేసింది.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు..

సోమవారం కలెక్టరేట్‌లో జరిగే జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేశారు. డివిజన్ మండల స్థాయిల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం మద్యం లాటరీ జరగనున్న దృష్ట్యా మీకోసం కార్యక్రమం రద్దు చేశారు.

వాడపల్లి వెంకన్న సన్నిధి కిటకిట



ఆత్రేయపురం, అక్టోబరు 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శని, ఆదివారాలు భక్తజనం పోటెత్తారు. రెండు రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.31.15 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు. అలాగే ఆదివారం పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో భక్తజనం బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ చెస్ పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

అమలాపురంటౌన్, అక్టోబరు 13: అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ జిల్లాస్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో బాలురు నలుగురు, బాలికలు నలుగురిని రాష్ట్రస్థాయి చెస్ సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు బాలుర విభాగంలో బండారు నానిబాబు ప్రథమ, కేశనకుర్తి రాజేష్ ద్వితీయ, పితాని ధ్యానసత్యకార్తీక్ తృతీయ, అరిగెల జయప్రకాష్ నాలుగో స్థానం సాధించారు. బాలికల విభాగంలో గెద్దాడ దేవి అక్షయ ప్రథమ, పణిశెట్టి ధరణి ద్వితీయ, గెద్దాడ ఆశ్రయ తృతీయ, పితాని సాయిలిఖిత నాలుగో స్థానం సాధించారు. విద్యానిధి విద్యాసంస్థల ఛైర్మన్ ఏబీ నాయుడు, రాష్ట్ర చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.జగదీష్ బహుమతులు అందచేశారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఈ నెల 15 నుంచి గుంటూరులో జరగనున్నాయి.



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

అమలాపురం టౌన్, అక్టోబరు 13: ఆదివాసీల హక్కులను కాపాడడంతో పాటు ప్రకృతి పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన యోధుడిగా గోకరకొండ నాగసాయిబాబా చరిత్రలో నిలిచిపోతారని పలువురు వక్తలు కొనియాడారు. 90 శాతం దివ్యాంగుడైనప్పటికీ మానవతా విలువలను కాపాడేందుకు ఆయన ఎన్నో పోరాటాలు చేశారని వివరించారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. నిర్బంధ కాలంలో అనుభవించిన కష్టాలు, ఒంటరితనం, సమాజం పట్ల బాధ్యత, చైతన్యాన్ని మాత్రం విస్మరించకుండా ఆయన కవిత్వం సాగించారని మానవహక్కుల వేదిక నాయకుడు నామాడి శ్రీధర్ పేర్కొన్నారు. సాయిబాబా ఇంగ్లీషులో రాసిన కవిత్వాన్ని తెలుగులో నేను చావును నిరాకరిస్తున్నాను అని పుస్తకంగా విడుదల చేశారన్నారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు జిల్లెల్ల మనోహర్, అమలదాసు బాబూరావు, చెల్లింగి త్రిమూర్తులు, మానవహక్కుల వేదిక రాష్ట్ర, జిల్లా నాయకులు మహ్మద్ ఇక్బాల్, ఎ.రవి, యేడిద రాజేష్, సీపీఐ జిల్లా నాయకుడు కె.సత్తిబాబు, వివిధ సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, రంగప్రసాద్, రాంప్రసాద్, కొండా దుర్గారావు, దీపాటి ప్రసాద్, బొంతు రమణ, దడాల రాజశేఖర్, రేవు తిరపతిరావు, మచ్చా నాగయ్య, గంగుమళ్ల శ్రీనివాసరావు, అయినాపురపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

నీటి సంఘాలకు మోగనున్న


ఎన్నికల నగారా

16న ఎన్నికల షెడ్యూల్

ఐదేళ్ల తర్వాత రైతుల్లో నూతనోత్సాహం

సాధారణ ఎన్నికల తర్వాత తొలి ఎన్నికలు

ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్న పార్టీలు



పి.గన్నవరం, అక్టోబరు 13: గత ఐదేళ్లుగా సాగునీటి పంపిణీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. దీంతో సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టే క్రమంలో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి వైసీపీ ప్రభుత్వం నిధులు లేమితో ఇబ్బందులు పడుతూ నిధులు మంజూరు విషయంలో సాగునీటి సంఘాలు నుంచి డిమాండ్‌లు వస్తాయనే భయంతో ఐదేళ్ల కాలంలో నీటి సంఘాల ఊసే ఎత్తలేదు. అయితే క్షేత్రస్థాయిలో సంఘాలు లేకపోవడం వల్ల కాల్వలు మరమ్మతులు, వాటి బాగోగులు ఐదేళ్ల పాటు జరగలేదు. దీంతో కాల్వలు అధ్వానంగా మారిపోయి సాగునీరు రైతులకు సక్రమంగా అందక దిగుబడి విషయంలో తీవ్రంగా నష్టపోయారు. నీటి పంపిణీలో రైతులను భాగస్వామ్యం చేసి పంటకాల్వలకు మళ్లీ పూర్వ వైభవం తేవాలనే ఉద్దేశంతో నీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 16న ప్రక్రియ ప్రారంభించే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు అనంతరం తొలిసారి జరిగే ఎన్నికలు కావడంతో ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గ్రామస్థాయిలో రైతు వర్గాలలో పట్టుసాధించేందుకు ఆయా పార్టీల నేతలు సమాయత్తమవుతున్నారు. దీంతో పచ్చని పంట పొలాల సాక్షిగా ఎన్నికల సందడి మొదలైంది. సాగునీటి సరఫరాలో కీలకపాత్ర వహించే సంఘాలకు నేతృత్వం వహించేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా మూడు పార్టీలకు సంబంధించిన ఆశావహులు ఉండటంతో సంబంధిత నేతలు పదవులు పంపకాల్లో నిమగ్నమయ్యారు. అంతే కాకుండా స్థానిక నేతలు సైతం తమ బయోడేటాలను ఇప్పటికే ఎమ్మెల్యే, మంత్రులకు అందించినట్లు సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రాజెక్టు కమిటీలకు సంబంధించి 144 సంఘాలు ఉండగా 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక పీసీ ఉన్నాయి. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 88 సంఘాలు ఉన్నాయి. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీకాలం ముగిసినప్పటికి అప్పటి వైసీపీ ప్రభుత్వం సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘాల కాల్వలకు ఉపయోగాన్ని గుర్తించి ఎన్నికల నిర్వహణకు సమయత్తమైంది. సుమారుగా తొమ్మిదేళ్ల తర్వాత జరగబోయే నీటిసంఘాల ఎన్నికలపై రైతులు సర్వాత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతుకు కూడా ఓటు హక్కు ఉంటుంది

ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాల పరిధిలో సుమారు 2.03 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి సంబంధించి జలవనరుల శాఖ అధికారులు వారి పరిధిలో ఉన్న ఆయకట్టు వివరాలను ఇప్పటికే ఆయా మండలాల రెవెన్యూ అధికారులకు అందించారు. ఒక్కో నీటి సంఘం పరిధిలోని ఆయకట్టు ఆధారంగా రైతులను గుర్తించి ఓటు హక్కును కల్పించనున్నారు. ఏ సర్వే నెంబరులో ఎంత మంది రైతులు ఉన్నారు. వీరిలో కౌలు రైతులు ఎంతమంది ఉన్నారో నిర్ధారించనున్నారు. ఈ వివరాలు ఆధారంగా రైతుల ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. అయితే నీటి సంఘాల ఎన్నికల్లో కౌలు రైతుకు కూడా ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ఓటు హక్కు కల్పించింది. రుణ అర్హత పొందిన ప్రతి కౌలు రైతుకు ఓటు హక్కు కల్పించనున్నారు. అయితే కౌలు రైతులు వారు సాగు చేసుకుంటున్న భూములు సర్వే నెంబర్లలో యజమానులకు ఓటు హక్కు ఉండదని అధికారులు చెబుతున్నారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులను ఓటర్లగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా చేసుకుని నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు.

సాగునీటి కాల్వలకు మహర్దశ

ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాల పరిధిలో అమలాపురం, పి.గన్నవరం, బ్యాంక్ కెనాల్, గోదావరి ఈస్ట్రన్ మెయిన్ కెనాల్ మొత్తం నాలుగు ప్రధాన పంట కాల్వలు సుమారుగా 240 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటికి అనుసంధానంగా చానల్స్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లు ఉన్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వీటి మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులు విషయాన్ని విస్మరించింది. ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులే బాధ్యతలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులు దారి మళ్లించడంతో కాల్వల మరమ్మతులకు మొండిచెయ్యి చూపింది. ఈ క్రమంలో నీటి సంఘాల ఎన్నికలు పూర్తికాగానే వచ్చే నిధులతో సాగునీటి కాల్వలకు పూర్వవైభవం రానుంది.

40 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ తేదీలపై ఈనెల 16న పూర్తిస్థాయి స్పష్టత రానుంది. తొలుత నీటి సంఘాలు ఎన్నిక, అనంతరం డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఎన్నిక, చివరగా ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగనుంది. పూర్తి ఎన్నికల ప్రక్రియ 40 రోజుల్లో పూర్తయ్యే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దిశగా జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షలు కూడా నిర్వహించారు. సమర్థవంతంగా ఎన్నికలు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. అలాగే సమస్యాత్మక సంఘాలను గుర్తించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు.

దసరా ఉత్సవాల్లో అపశ్రుతి

డీజే పాటలకు డ్యాన్స్ చేస్తుండగా కుప్పకూలి యువకుడి మృతి


సాయివినయ్ (పాత చిత్రం)

అమలాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్సవంలో ఉత్సాహం ఉరకలు వేసింది. డీజే ముందు డ్యాన్సులు చేస్తూ సహచర మిత్రులతో సంబ్రమాశ్చర్యాల్లో మునిగి తేలిన ఆ యువకుడు అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. కొన్ని నిమిషాల తర్వాత తనువు చాలించిన ఈ ఘటన కొంకాపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. యువకుడి మృతి ఆ సంబరంలో పాల్గొన్న వేల మందిని కలచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి... విజయదసమి పర్వదినం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలోని కొంకాపల్లిలో శనివారం రాత్రి చెడీతాలింఖానా ఉత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన పప్పుల సాయివినయ్ (22) డీజే వద్ద డాన్సులు చేస్తుండగా సడన్‌గా కుప్పకూలిపోయాడు. అతడిని హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో అటు కొంకాపల్లి సంబరంలోను, ఇటు బండారులంకలోను విషాదఛాయలు అలుముకున్నాయి. సాయివినయ్ బీటెక్ పూర్తిచేసి ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఇంతలోనే మృత్యువాతపడడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు వర్ణనాతీతం. సాయివినయ్ మృతికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో అమలాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేయలేనట్టు తెలిసింది.

టెంట్ కడుతుండగా గోడపై నుంచి కిందపడి...


వీర్రాఘవరెడ్డి (పాత చిత్రం)

అనపర్తి, అక్టోబరు 13: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో శరన్నవరాత్రి అన్నసమారాధనలో అపశ్రుతి జరిగింది. ప్రమాదవశాత్తూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తి గంగిరెడ్డి, ఆయన కుమారుడు వీర్రాఘవరెడ్డి (33) టెంట్ హౌస్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే అన్నసమారాధనకు టెంట్ ఏర్పాటు చేసేందుకు వెళ్లిన వీర్రాఘవరెడ్డి గోడపై నిలుచుని తాడును కట్టే క్రమంలో అదుపు తప్పి సిమెంట్ రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అనపర్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. వీర్రాఘవరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ చెప్పారు.



వేదమూర్తి, వీరబ్రహ్మం (పాత చిత్రాలు)

గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు గల్లంతు

కె.గంగవరం, అక్టోబరు 13: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు గల్లంతయ్యారు. స్థానికులు, పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం రావిచెరువుకు చెందిన మేడిశెట్టి వీరబ్రహ్మం, నరాల వేదమూర్తి గ్రామస్తులతో కలిసి ఆదివారం కోటిపల్లి గోదావరి వద్దకు అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువచ్చారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత గోదావరిలో స్నానానికి దిగారు. నీటిని అంచనా వేయలేకపోవడంతో వారు మునిగిపోయారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు జాడ తెలియలేదు. గల్లంతైన వారు కుటుంబాలను కాయకష్టం చేసుకుని పోషించుకుంటున్నారు. ఇద్దరూ వివాహితులు. వేదమూర్తికి ఆరు నెలల క్రితమే పెళ్లయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జానీబాషా చెప్పారు.

బాలికపై లైంగిక దాడి

ఆత్రేయపురం, అక్టోబరు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నాలుగేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ నెల 11న మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికను రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన నల్లారి శివ అనే యువకుడు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆ బాలిక అమ్మమ్మకు చెప్పింది. ఈ నెల 12వ తేదీన ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆదివారం శివను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.



రాజరాజేశ్వరి అలంకారంలో వనదుర్గ అమ్మవారు, సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లకు శమీపూజ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యదేవుని సన్నిధిలో వేడుకగా దసరా

అన్నవరం, అక్టోబరు 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో దసరా వేడుకలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల్లో చివరి రోజైన శనివారం కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. దర్బారు మండపంలో విశేష పూజలు, హోమ పూర్ణాహుతి గావించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను, వెండి గజవాహనంపై, సీతారాములను పల్లకిలో మేళతాళాలతో కొండ దిగువన హైస్కూలు వద్దకు తోడ్కొని వచ్చి అర్చకులు శమీ పూజ నిర్వహించారు. 'శమీ శమయతే పాపం శమీ శతృవినాశనీ అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శిని' అను మంత్రం పఠించి శమీ వృక్షం చుట్టూ ముమ్మారు స్వామి, అమ్మవార్లను ప్రదక్షిణ గావించారు. అనంతరం కళాశాల మైదానం వద్దకు స్వామి, అమ్మవార్లను తీసుకెళ్లి విశేష అర్చనలు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ సహాయ కమిషనర్ విశ్వనాథరాజు, సీహెచ్ రామ్మోహనరావు విల్లు ఎక్కుపెట్టి రావణ దహనం చేశారు. అన్నవరం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తిలకించారు.



విజేతలుగా నిలిచిన తూర్పు గోదావరి జిల్లా బాలురు, బాలిక జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

'తూర్పు'దే పైచేయి

- ముగిసిన అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నీ
- బాలురు, బాలికల విభాగాల్లో విజేత 'తూర్పు గోదావరి'
- రన్నరప్‌గా అనంతపురం బాలురు, కృష్ణా బాలికలు

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన జీఎంసీ బాలయోగి స్మారక ఏపీ సబ్ జూనియర్స్ 9వ అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నీ శనివారం ముగిసింది. బాలురు, బాలికల విభాగాల్లో తూర్పు గోదావరి జట్లు విజేతలుగా నిలిచాయి. బాలురు విభాగంలో అనంతపురం జట్టు, బాలికల విభాగంలో కృష్ణా జట్టు రన్నరప్‌గా నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు, క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ ప్రభుత్వం విద్య, క్రీడా రంగాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించిందన్నారు. అమలాపురంలో తన తండ్రి, లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి నిర్మించిన స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ కోర్టును సింథటిక్ కోర్టుగా అభివృద్ధి చేయడానికి తన వంతు సహకరిస్తానని ప్రకటించారు. బాస్కెట్‌బాల్ ఇండోర్ స్టేడియం నిర్మించబోతున్నామని ప్రకటించారు. రిఫరీ డేవిడ్ అంతర్జాతీయ స్థాయి రిఫరీగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఫైనల్ మ్యాచ్‌లను చూస్తే పాత జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయన్నారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తూర్పు గోదావరి అభివృద్ధికి బాలయోగి చేసిన కృషి మరువలేనిదని, ఆయన బాటలోనే హరీష్ మాధుర్ పయనిస్తూ రామచంద్రపురంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ క్రీడను నిరంతరం ప్రోత్సహిస్తున్న గన్నమని చక్రవర్తిని అభినందించారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఎంపీగా గెలుపొంది నేడు ట్రోఫీ ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆనందదాయకమన్నారు. రామచంద్రపురంలో కోర్టుల అభివృద్ధి పనులు పూర్తయితే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు రాష్ట్ర స్థాయి కోచింగ్ క్యాంపు ఇక్కడే నిర్వహిస్తామని ప్రకటించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ కోట సతీష్‌కుమార్ మాట్లాడారు. ఎంపీ హరీష్‌మాధుర్‌ను అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు. పీడీగా పనిచేస్తూ ఎంతోమంది నియమితులైన అప్పాజీ, అంతర్జాతీయ రిఫరీగా ఎంపికైన డేవిడ్, క్లినిక్‌కి ఎంపికైన షాబుద్దీన్ బేగ్‌లను ఎంపీ హరీష్ సత్కరించారు. డాక్టర్ చెలికాని రామారావు, జిల్లా కార్యదర్శి మాణిక్యాలరావు, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- రూ.5 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం
- 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నాగబాబు (పైన). స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు (కింద)

గండేపల్లి, అక్టోబరు 13: బంగారు ఆభరణాలు కనిపించకపోవడంపై నమోదైన కేసును జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ నేతృత్వంలో గండేపల్లి ఎస్ఐ యూటీ శివనాగబాబు 24 గంటల్లోనే ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసి అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శివనాగబాబు శనివారం సాయంత్రం వెల్లడించారు. విశాఖపట్నానికి చెందిన మొల్లేటి సుగుణ ఈ నెల 7న తన ఇద్దరు పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని అక్క ఇంటికి వచ్చి అక్కడి నుంచి అమ్మమ్మ ఊరు గండేపల్లి మండలం మురారి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఈ సమయంలో ఆటోలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె బ్యాగులో ఉన్న బంగారు వస్తువులను దొంగలించారు. ఆమె ఇంటికి వెళ్లి బ్యాగు తెరిచి చూడగా బంగారు వస్తువులు కనిపించకపోవడంతో గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమైన వారు సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెట్టి ఈ నెల 12న మురారి శివారున అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ, మేరకనపల్లి వెంకటేశ్వరరావు, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొట్లం గ్రామానికి చెందిన రావుల వసంత, తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలానికి చెందిన నాగులూరి శివపార్వతిని అరెస్టు చేశారు. వీరిపై పాత కేసులు ఉన్నట్టు గుర్తించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.5లక్షలు విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలు, టాటా ఇండిగో సీఎస్ కారు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, ఏఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది వీరబాబు, బాషా, సూరిబాబులను ఉన్నతాధికారులు అభినందించారు.



అనపర్తి మాజీ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

ద్రాక్షారామ, అక్టోబరు 13: అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు ఆదివారం డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం వద్ద ప్రమాదానికి గురైంది. రామచంద్రపురం వైపు నుంచి వస్తున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నాయి. దీంతో కారు ముందు భాగం దెబ్బతింది. ఆటో తిరగబడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనట్టు తెలిసింది. ఆటో డ్రైవరు కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే తన కారులో ఆసుపత్రికి తరలించి ఆయన మరో కారులో వెళ్లారు.


శతకోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

శ్రీపీఠంలో ముగిసిన మహాశక్తి యాగం

శతకోటి కుంకుమార్చనలో పాల్గొన్న వేలాది మంది మాతృమూర్తులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 13: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠంలోని గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజులు జరిగిన మహాశక్తి యాగం ఘనంగా ముగిసింది. శతకోటి (100 కోట్ల) కుంకుమార్చన మహాక్రతువు శనివారం పూర్తయ్యింది. యాగశాలలో 9.27 లక్షల బగళాముఖి యాగం, 1325 రుద్ర, 330 చండీ, లక్ష విశేష దేవతా హోమాలు దిగ్విజయంగా పూర్తయ్యాయని స్వామీజీ చెప్పారు. 1.2 లక్షల గాయత్రీ మంత్ర అనుష్ఠానం జరిగింది. శనివారం ఐశ్వర్యాంబిక అమ్మవారు రజత కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాశక్తి యాగంలో చివరి రోజైన ఆదివారం ఉదయం ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యాలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ జరగని రీతిలో మహాశక్తి యాగాన్ని వేలాది మంది మాతృమూర్తులతో దిగ్విజయంగా పూర్తి చేశామని, అంతా అమ్మ అనుగ్రహమేనన్నారు. వేలాది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసిన దాతలు, వలంటీర్లు, ఇతర సేవకులు, బందోబస్తు కల్పించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్, సారధ్యం వహించిన డీఎస్పీ రఘువీర్, సర్పవరం, కాకినాడ రూరల్ సర్కిల్, ట్రాఫిక్, టౌన్ సీఐలు బి.పెద్దిరాజు, డీఎస్ చైతన్యకృష్ణ, డి.రామారావు, పోలీసు అధికారులు, సిబ్బందికి స్వామీజీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


గోపిమూర్తి పరిచయ సభలో ఐక్యత చాటుతున్న నాయకులు

పీడీఎఫ్ ఎమ్మెల్సీలది ప్రజా పక్షం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పరిచయ సభలో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 13: పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా గెలిచిన వారంతా శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పారని, ప్రజాపక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికలో పీడీఎఫ్ ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేయనున్న బొర్రా గోపిమూర్తి పరిచయ సభ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగింది. గోపిమూర్తి అభ్యర్థిత్వాన్ని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు ప్రతిపాదించగా నాయకులు సంఘీభావం ప్రకటించారు. గోపిమూర్తి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు, ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రశ్నిస్తానన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు గాంధీ, ప్రభాకర్ మాట్లాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సభలో తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, జ్యోతిబసు, పెంకే వెంకటేశ్వరరావు, తోటకూర చక్రవర్తి, నగేష్, అన్నారాం, విల్సన్, మహేష్‌రావు, సీనియర్ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి రూ.10లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు సమర్పణ



కోరుకొండ, అక్టోబరు 13: తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ వక్షస్థలంలో ఉన్న లక్ష్మీదేవికి బంగారు కిరీటాన్ని కోరుకొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బొల్లెంపల్లి ఆదినారాయణమూర్తి, బొల్లెంపల్లి మాధవరావు కుటుంబ సభ్యులు బహూకరించారు. విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయంలో లక్ష్మీదేవికి సుమారు రూ.4లక్షలతో వెండి కిరీటం, కవచం, చీరలను కోరుకొండకు చెందిన కప్పల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు బహూకరించారు. గోదాదేవికి వెండి మకరతోరణాన్ని, అభిషేక సమయంలో వినియోగించేందుకు వెండి చక్రాన్ని భక్తులు అందజేశారు. నూతన బంగారు, వెండి వస్తువులకు సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి అలంకరించారు. వీటి విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుందని ధర్మకర్త రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు చెప్పారు.

కారును ఢీకొన్న బైక్: ఇద్దరికి తీవ్ర గాయాలు

క్షతగాత్రుల బ్యాగ్‌లో 15 కిలోల గంజాయి గుర్తింపు

గోకవరం, అక్టోబరు 13: ఏజెన్సీ ప్రాంతమైన మారేడుమిల్లి నుంచి మోటారు సైకిలుపై ఇద్దరు వ్యక్తులు అతివేగంతో రాజమహేంద్రవరం వైపునకు వెళ్తుండగా గోకవరం గ్రామ శివారున ఎదురుగా వస్తున్న కారును ఢీకొని ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు సపర్యలు చేస్తుండగా వారి వద్ద బ్యాగ్‌లో ఉన్న గంజాయిని పోలీసులు గుర్తించారు. వారిని ఎన్టీఆర్ జిల్లా కంకిపాడు మండలం మాదానువారిపాలేనికి చెందిన జ్యోతి ప్రకాష్, ప్రతాప్‌గా గుర్తించి సుమారు 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య సహాయం నిమిత్తం ఒకరిని కాకినాడ, మరొకరిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. నిందితులు కోలుకున్నాక వారి నుంచి పూర్తి సమాచారం సేకరించి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కట్టమూరులో చైన్ స్నాచింగ్


బాధితురాలు భూలక్ష్మి

పెద్దాపురం, అక్టోబరు 13: పట్టపగలే మహిళ మెడలో బంగారు గొలుసును బైక్‌పై వచ్చి లాక్కుపోయారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన సిద్దన భూలక్ష్మి విజయదశమి రోజైన శనివారం ఉదయం కనకదుర్గ ఆలయానికి నడుచుకుంటూ బయల్దేరింది. ఇంతలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేసినా దొరకలేదు. బంగారు గొలుసు సుమారు మూడు కాసులు ఉంటుందని బాధిత మహిళ తెలిపింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

సామర్లకోట, అక్టోబరు 13: కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందింది. తాళ్లరేవు మండలం జార్జిపేటకు చెందిన దొంతిన ఆదిలక్ష్మి (60 తన భర్తతో కలిసి మోటారు సైకిలుపై పెద్దాపురం వెళ్తోంది. వీకే రాయపురం సమీపించే సరికి రోడ్డుపై ఉన్న గొయ్యిని తప్పించే ప్రయత్నంలో బైక్ గోతిలో పడి అదుపు తప్పింది. వెనుక కూర్చున ఆదిలక్ష్మి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలంలో మృతురాలి భర్త రోదించిన తీరు పలువురిని కలచివేసింది. సామర్లకోట పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు చెప్పారు.

ప్రమాదవశాత్తు పెయింటర్ మృతి


మృతుడు నాని (పాత చిత్రం)

సామర్లకోట, అక్టోబరు 13: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవరలో ఒక భవనానికి పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ భవనంపైనుంచి కిందికి పడి ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సహచర కూలీలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స మధ్యలోనే ఒక వ్యక్తి మృతి చెందాడు. అతడిని పిఠాపురం రథాలపేటకు చెందిన కొమ్ము నాని(25)గా పోలీసులు గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని వైద్యవర్గాల ద్వారా తెలిసింది. కాగా మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ అతడి కుటుంబ సభ్యులు ప్రమాదం జరిగిన భవనం ముందు ఆందోళనకు దిగారు. భవన యజమానితో కుటుంబీకులతో పాటు పోలీసులు చర్చలు ప్రారంభించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు చెప్పారు.

మినీ బస్సును ఢీకొట్టిన ఐషర్ వ్యాన్

కొవ్వూరు గామన్ బ్రిడ్జి దాటాక ఘటన: మహిళ మృతి, ఏడుగురికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 13: భవానీ భక్తులు వెళ్తున్న మినీ బస్సును ఐషర్ వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఏడుగురికి గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన 27 మంది భవానీలు మినీ బస్సులో విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి బయల్దేరారు. శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు దాటిన తర్వాత దొమ్మేరు వైపు ఆగారు. ఆగి ఉన్న బస్సును రాజాం నుంచి పురికొస లోడుతో చిత్తూరు జిల్లా మదనపల్లి వెళుతున్న కర్ణాటకకు చెందిన ఐషర్ వ్యాన్ వెనుక నుంచి ఎడమ పక్కన ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక రెండు సీట్లు పూర్తిగా దెబ్బతినడంతో పోలవరపు అప్పలనరసమ్మ (55) మృతి చెందింది. ఇదే ప్రమాదంలో పోలవరపు త్రీష్మ, పి.నిహారిక, కురం భార్గవి, కె.నాగలక్ష్మి, ఇందల చిన్నమ్మ, ఈ.రామానాయుడు, వనం కిషోర్ గాయాలపాలయ్యారు. వీరిని రోడ్డు సేఫ్టీ సిబ్బంది కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు...

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం దుగ్గాడ గ్రామానికి చెందిన భవానీ భక్తులు రెండు టాటా ఏస్ వాహనాల్లో విజయవాడ వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలయ్యాయి. వీరి వాహనాల్లో ఒకటి మరమ్మతులకు గురికావడంతో ఒకదానికొకటి కట్టుకుని తిరిగి ఇంటికి బయల్దేరారు. కొవ్వూరు టోల్‌ప్లాజా సమీపంలోని బ్రిడ్జి దాటుతుండగా టాటా ఏస్ వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రెండు టాటా ఏస్ వాహనాలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. రాత్రి గస్తీలో ఉన్న పట్టణ సీఐ పి.విశ్వం క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఆసుపత్రులకు తరలించారు.


కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భవానీ భక్తులు



నిషా షార్ట్ ఫిల్మ్ టీజర్ విడుదల

కొత్తపేట, అక్టోబరు 13: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వగ్రామం వాడపాలెం గ్రామానికి చెందిన యువకులు నిర్మించిన నిషా షార్ట్‌ఫిల్మ్ టీజర్‌ను ఆదివారం ఎమ్మెల్యే బండారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనంచేసుకుంటున్న తరుణంలో తమ గ్రామ యువత మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఈ షార్ట్‌ఫిల్మ్ తీయడం అభినందనీయమన్నారు. చీకట్ల అబ్బు, బండారు వీరబాబు, గుబ్బల మూర్తి పాల్గొన్నారు.

చెడుపై మంచి ఎప్పుడూ విజయమే!

- వైభవంగా విజయదుర్గాదేవి రథోత్సవం
- వేంకటేశ్వరస్వామికి శాంతి కల్యాణం
- ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



రాయవరం: వెదురుపాకలో విజయదుర్గా అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, అక్టోబరు 13: జైదుర్గాభవాని... కరుణించు తల్లీ... శ్రీనివాసా గోవింద... శ్రీవెంకటేశా గోవింద... అంటూ భక్తుల నామస్మరణ మధ్య మండలంలోని వెదురుపాకలో విజయదుర్గ అమ్మవారి రథోత్సవం, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గరుడ వాహనసేవ శనివారం వైభవంగా జరిగాయి. విజయదశమిని పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపైన, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపైన ఉంచి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అమ్మవారికి హారతులు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ... దుష్టసంహారంలో భాగంగా దుర్గాదేవి అనేక అవతారాలు ధరించి రాక్షస సంహారం చేసిందన్నారు. చెడుపై మంచి ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందనే సందేశం ఇచ్చిందన్నారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణాన్ని తిరుపతికి చెందిన వైఖానస పండితుడు సాయి రామాచారి ఆధ్వర్యంలో ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబీ), విజయదుర్గ సేవా సమితి సభ్యులు గాదే సత్య వెంకటకామేశ్వరి భాస్కరనారాయణ, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

మండపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండపేట పట్టణంతోపాటు, మండలంలో వున్న అమ్మవారి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. శనివారం రాత్రి జమ్మిచెట్టువద్ద శమిపూజ నిర్వహించారు.

వాసవీమాతకు 108 రకాల పిండి వంటలతో నైవేద్యం

దసరా వేడుకలను పురష్కరించుకుని ద్వారపూడిలో ఉన్న శ్రీవాసవీమాత అమ్మవారికి 108 రకాల పిండి వంటల నైవేద్యంను సమర్పించారు. వాసవీ మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలు విటిని అమ్మవారికి సమర్పించారు. అనంతరం సమీపూజ నిర్వహించారు.

పి.గన్నవరం: దశమి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శనివారం పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో శ్రీకనకవదుర్గ ఆలయంలో ఉదయం ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. సాయంకాలం జమ్మిచెట్టు వద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ఊరేగించారు. అదే విధంగా భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అలాగే లంకలగన్నవరం లాకు వద్ద ఏర్పాటు అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు,

యానాం: యానాంలోని అన్ని ఆలయాల్లో అమ్మవార్లు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గిరియాంపేట రోడ్డులోని పాలకనదుర్గమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ, రాముల ఆధ్వ ర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన అగ్ని గుండంలో భవానీ భక్తులతో పాటు యానాం పరిసరప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యానాం త్యాగరాజవీధిలోని లలితాదేవి, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి, శివాలయ ప్రాంగణంలోని వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లు రాజరాజేశ్వరి దేవి ఆలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభు త్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయలక్ష్మీ దంపతులు అమ్మవార్లను దర్శించి విశేష పూజలు చేశారు.

ముమ్మిడివరం: మండలంలో పలుగ్రామాల్లో అమ్మవారి ఉరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరిం చి వాహనంపై ఉంచి ఉరేగింపు నిర్వహించారు. పలుచోట్ల భారీ అన్నసమారాధన



ద్వారపూడిలో వాసవీమాతకు 108 రకాలు పిండి వంటలు



యానాం: అమ్మవార్లను దర్శించుకుంటున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి దంపతులు



కొత్తపేట: విజయదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

చేశారు. ముమ్మి డివరం మార్కెట్ శివారులోని విజయదుర్గ అమ్మ వారి ఆలయంవద్ద బేడాబు డగ జంగాల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉరేగింపు నిర్వహి ంచారు. కళ్యాణమావుళ్లు, కళ్యాణసత్యం, ముగ్గనూకాలు, ఉప్పసుబ్బారావు, మరిడియ్య నేరగంటి సాయితోపాటు పలువురు పాల్గొన్నారు. అనాతవరం వనచర్లవారిపాలెం అన్నంపల్లి పంచాయతీ పరిధిలోగల లక్ష్మీదేవిలంక, గాడిలంక కర్రివానిరేవు గ్రామాల్లో అమ్మవారి ఉరేగింపు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర వీవర్స్ కాలనీ దుర్గాదేవి ఆలయంవద్ద అర్చకులు కొలువుల మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో శమీపూజ నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి 41 రకాల ప్రసాదాలతో మహా నైవేద్యం సమర్పించారు. వల్లూరు ప్రధాన చెరువులో దుర్గాదేవి అమ్మవారికి తెప్పోత్సవం కనుల పండుగగా సాగింది. నే



ముమ్మిడివరంలో బేడబుడగజంగాల ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

లటూరు, కపిలేశ్వరపురం, వెదురుమూడి, కోరుమిల్లి తదితరల గ్రామాల్లో అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అంబాజీపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెలకొల్పిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలవద్ద అన్నసమరాధాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలలో భాగంగా అమ్మవార్ని పూరవీధులలో ఊరేగించారు. మాచవరం, అంబాజీపేట, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, ఇసుకపూడి, ముక్కామల, మొసలపల్లి, చిరతపూడి, తదితర గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఐ.పోలవరం: విజయదశమి సందర్భంగా మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయంలో శమీపూజ వైభవంగా జరిగింది. నాగభట్ల కృష్ణమూర్తి, పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను జమ్మి వృక్షం వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో దాట్ల ఇంద్రరాజు, దాట్ల రామకృష్ణంరాజు, ఆలయ సహాయ కమీషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలో శరన్నవరాత్రి ముగిశాయి. శనివారం దసరా ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు.శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని అమ్మవారిని నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి షిరిడీసాయి ఆలయంలో విజయదశమి పూజలు ఘనంగా నిర్వహించారు. భీమనపల్లి సాయి ఆలయంలో ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి ఆధ్వర్యంలో దశమి వేడుకలు జరిగాయి. గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీ, సన్నవిల్లి, వాడపర్రు, ఉప్పలగుప్తం, కూనవరం, పెదగాడవిల్లి, విలసవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

అల్లవరం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలను తీన్‌మార్ వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. బోడసకుర్రు, అల్లవరం, కోడూరుపాడు, బెండమూర్లంక, మొగళ్లమూరు, గోడిలంక, కొమరగిరిపట్నం, దేవగుప్తం, యెంట్రుకోన, డి.రావులపాలెం గ్రామాల్లో దసరా ఊరేగింపులు ఘనంగా జరిగాయి. దుర్గాదేవి పూజా విగ్రహాలను పూజల అనంతరం వైనతేయ గోదావరిలో నిమజ్జనం చేశారు. దసరా పందిర్ల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి.


అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి: బండారు

కొత్తపేట: విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. విజయదశమిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలివెల గ్రామ శేరేపాలెం భేతాళస్వామి ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. కొత్తపేట బొరుసువారి సావరం తదితర ప్రాంతాల్లోని అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బొరుసు భాస్కరరావు, గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, చవల జగన్నాథం, సాదే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు అమ్మవార్లకు నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈతకోట, రావులపాలెంలో ఉన్న అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. భవానీ మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బుర్రావారి వీధి ఏనుగు



నున్నవారి వీధి ఏనుగు



కర్రివారి వీధి ఏనుగు

ఘనంగా ఏనుగుల సంబరం

ద్రాక్షారామ, అక్టోబరు 13: విజయదశమి పురస్కరించుకుని ద్రాక్షారామలో శనివారం రాత్రి ఏనుగుల సంబరం ఘనంగా జరిపారు. శనివారం రాత్రి బుర్రావారి వీధి, నున్న వారి వీధి, కర్రివారి వీధి ఏనుగుల సంబరం నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణతో ఏనుగులు మిరుమిట్లు గొలిపాయి. బ్యాండు మేళాలు, కోయనృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు నిర్వహించారు. నున్నవారి వీధి, బుర్రవారి వీధి ఏనుగులు ద్రాక్షారామలో సూర్యవీధి నుంచి వెలంపాలెం మీదుగా చంద్రవీధి భీమేశ్వరాలయానికి ఊరేగింపు జరిపారు. కర్రివారి వీధి ఏనుగు కర్రివారి వీధి నుంచి యానం సెంటర్‌మీదుగా ద్రాక్షారామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దేశంశెట్టి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల

ఘనంగా దేశంశెట్టి జన్మదిన వేడుకలు

ఉప్పలగుప్తం, అక్టోబరు 13: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ, కోనసీమ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమనపల్లికి చెందిన దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు శనివారం కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొని లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలిపి, కేక్ తినిపించారు. లక్ష్మీనారాయణ, నాగరత్నకుమారి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమలాపురం వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ జంగా అబ్బాయివెంకన్న, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గొలకోటి చిన్నా, మండల అధ్యక్షుడు ఆకేటి పెద్ద, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు నల్లా బాబండి, చిక్కం జంగమయ్య, కరాటం ప్రసన్నప్రవీణ్, పెనుమాల సునీత, కోలపల్లి గోపి, కూటమి నాయకులు మద్దింశెట్టి సురేష్, కంకటాల రామం, ఆకుల సూర్యనారాయణమూర్తి, సలాది నాగరాజు, పోలిశెట్టి అయ్యప్పనాయుడు, గుర్రింక చిన్నా, గాలిదేవర సురేష్, సలాది శ్రీనివాసరావు, బూసి బుజ్జిదొర, పెయ్యల దుర్గారావు, రవణం మధు, గొలకోటి సత్తిరాజు, మల్లాడి వెంకటరమణ, చిక్కం సుధ, చిక్కం కాసు, చీకట్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

- కాపాడి ఒడ్డుకు చేర్చిన యువకులు, పోలీసులు



గోదావరిలో దూకిన రాజేశ్వరిని ఒడ్డుకు చేర్చిన దృశ్యం

రావులపాలెం, అక్టోబరు 13: కుటు ంబ కలహాల కారణంగా ఓ వివాహిత గౌతమి వంతెనపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రావులపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు, హైవే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం నడిపూడిలో వెన్నేటి రాజేశ్వరి భర్త శ్రీనివాస్ పిల్లలతో కలిసి జీవిస్తోంది. కుటుంబంలో తలెత్తిన వివాదం కారణంగా జీవితంపై విరక్తిచెంది ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతానికి రావులపాలెం పాత వంతెనపైకి చేరుకుని గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయితే అటుగా వెళ్లే పలువురు పోలీసులకు, హైవే సిబ్బందికి సమాచారం అందించారు. ఆ చెంతనే ఉన్న యువకులు మత్స్యకారుల బోటు సాయంతో అక్కడికి వెళ్లి గోదావరిలోకి దూకి గాలింపు చర్యలు చేపట్టారు. అపస్మారక స్థితిలో ఉన్న రాజేశ్వరిని పడవలో ఒడ్డుకు చేర్చారు. దీంతో హెచ్‌సీ నాయుడు టోల్‌రూట్ మేనేజర్ గంటా సురేష్ మోటార్‌సైకిల్‌పై ఆమెను స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. దీంతో రాజేశ్వరి ప్రాణపాయస్థితి నుండి బయటపడినట్లు వారు తెలిపారు.

వాడపల్లి నుంచి అమ్మవారికి సారె



వాడపల్లి వెంకన్న ఆలయం నుంచి సారె తీసుకువెళ్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 13: ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలోఉన్న శ్రీ విజయకనకదుర్గమ్మ అమ్మవారికి వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం తరపున సారెను సమర్పించారు. ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు పట్టువస్త్రాలు, సారెను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం శమీ పూజ నిర్వహించారు.

దమ్మ దీక్షా కుటుంబాలు కలయిక



అదుర్రు బౌద్ధస్థూపం వద్ద పూజలు నిర్వహిస్తున్న బౌద్ధ కుటుంబాలు

మామిడికుదురు, అక్టోబరు 13: ఆదుర్రు ఆదిబౌద్ధ స్థూపంవద్ద బౌద్ధ దమ్మ దినోత్సవాన్ని పురష్కరించుకుని దమ్మ దీక్ష చేపట్టిన కుటుంబాల కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా బౌద్ధస్థూపం చుట్టూ ప్రదక్షణలు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదుర్రు బుద్ధవిహార్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బుద్ధవందనం, దమ్మ వందనం చేశారు. ఇంకా పలువురు బుద్ధుని బోధనలను ప్రతిఒక్కరూ అనుసరించాలని వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, మెండి ప్రతాప్‌కుమార్, పళ్ల శ్రీనివాసరావు, బడుగు సాయిబాబు, నెల్లి దుర్గాప్రసాద్, బత్తుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ సవరపు

మండపేట, అక్టోబరు13: మండపేట మున్సిపాల్టీలో అధికార వైసీపీ కౌన్సిల్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఆరుగురు అధికార వైసీపీ కౌన్సిలర్‌లు టీడీపీలో చేరారు. తాజాగా మరో వైసీపీ కౌన్సిలర్ 7వ వార్డుకు చెందిన సవరపు సతీష్ ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌ల సమక్షంలో టీడీపీలో చేరారు. సతీష్‌తోపాటు అతడి అనుచరులకు ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీవరప్రకాష్‌లు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం



బాలబాలాజీ సన్నిధిలో ఎంపీ హరీష్‌మాధుర్‌కు స్వాగతం దృశ్యం

మామిడికుదురు,అక్టోబరు 13: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుందని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్‌మాధూర్ అన్నారు. ఆదివారం ఆయన అప్పనపల్లి బాలబాలజీ స్వామిని దర్శించుకుని ప్రత్యే కపూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వాచనం అందించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూజ లు చేశారు. అనంతరం అప్పనపల్లిలోని సాయివీరభద్రస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాలలో మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, బోణం బాబు, అడబాల తాతకాపు, తుల గోపాలకృష్ణ, కూటమి నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వవైభవం సంతరించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ

మామిడికుదురు, అక్టోబరు 13: జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. రాజోలు నియోజకవర్గ మాజీ వైసీపీ కో-ఆర్డినేటర్ మత్తి జయప్రకాష్‌రెడ్డి తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి జిల్లా అధ్యక్షులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ఆరీఫ్, చిలకపాటి శ్రీధర్, దొమ్మేటి సత్తిబాబు, గుబ్బల నాగరాజు, కొండేటి వెంకటేశ్వరావు, కలిగిలి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యానాం వెంకన్న బ్రహ్మోత్సవాలు

యానాం, అక్టోబరు 13: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి బాలలయంలో ద్వివింశతి(22వ) బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ అధికారులు, పలువురు దాతల సహకారంతో పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కరకుదుదు వాస్తవ్యులు వాడపల్లి గోపాలాచార్యుల నేతృత్వంలో శ్రీకారం చుట్టిన ఈ బ్రహ్మోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆదివారం ఉదయం ఆలయంలో వర్షవర్ధనహోమం, చక్రతీర్థ ప్రోక్షణ, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు. రాత్రి అగ్నికులక్షత్రియ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో స్వామివారి పుష్పయాగోత్సవం నిర్వహించారు.

సరస్వతీదేవికి వెండివీణ బహూకరణ

అంబాజీపేట, అక్టోబరు 13: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈనెల 16న జరిగే విజయభేతాళ ఉత్సవంలో పాల్గొనే హంసవాహనం సరస్వతిదేవి అమ్మవారికి వెండివీణను బహూకరించారు. మాచవరం దొమ్మేటివారిపాలానికి చెందిన రాయుడు వెంకటరమణ-విజయమంగాలక్ష్మీ దంపతులు రూ.1.25 లక్షల వెండివీణను కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవార్కి అలంకరించారు. అనంతరం దాతలను సత్కరించారు.

జనసేన సమావేశంలోకి దూసుకొచ్చిన రాపాక

మలికిపురం, అక్టోబరు 13: మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో రాజోలు నియోజకవర్గ జనసేన పార్టీ సమావేశం జరుగుతోంది. సమావేశంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రసంగిస్తున్నారు. ఈలోపు వైసీపీకి చెందిన రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సమావేశంలోకి తన అనుచరులతో వేదికపైకి వచ్చారు. దీంతో సమావేశంలో ఉన్న వారంతా ఒక్కసారి ఆశ్చర్యానికి గురయ్యారు. జనసేన పార్టీలోకి రాపాక వస్తున్నాడా అంటూ చర్చించుకున్నారు. ఈలోపు రాపాక రాజోలు ఎమ్మెల్యే దేవను వేదిక పక్కన ఉన్న అతిథిగృహంలోకి తీసుకువెళ్లి 20 నిమిషాలపాటు మంతనాలు జరిపారు. తీరా చూస్తే గత 33 రోజుల నుంచి అధ్యాపకులు చేస్తున్నసమ్మె విషయమై, దాని పరిష్కారంకోసం మా ట్లాడేందుకు వచ్చినట్టు తెలిసింది. రాపాకవెళ్లిన తర్వాతదేవ ఇదే విషయాన్ని తెలిపారు.

టీడీపీ జనసేన కూటమి పాలనలో గ్రామస్వరాజ్యం

అల్లవరం, అక్టోబరు 13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధే లక్ష్యమని కూటమి కార్యకర్తలు ఐక్యతతో అభివృద్ధికి సహకరించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కొమరగిరిపట్నం పరిధిలోని నక్కా రామేశ్వరం శివాలయం బ్రాహ్మణవీధి సీసీ రోడ్లకు ఎమ్మెల్యే ఆనందరావు శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. కొమరగిరిపట్నంలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపీరాజు, పిండి గణపయ్య, కటికిరెడ్డి బాబి, నల్లా రాము, పరసా కిరణ్, సీహెచ్ కిరణ్, దాట్ల గోపీరాజు, కంకిపాటి వీరబాబు, పిండి సురేష్, లింగం శ్రీను పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు : ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ త్వరలోనే అమలులోకి వస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. శనివారం రావులపాలెం డిపోకు సంబంధించి మంజూరైన నూతన బస్సులను వాడపాలెంలో ఆర్టీసీ సంస్థ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం డిపోకు ఐదు నూతన బస్సులు వచ్చాయని, అలాగే మరో ఐదు నూతన లగ్జరీ బస్సులు కూడా అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. త్వరలోనే రావులపాలెం ఆర్టీసీ డిపో ఆధునికీకరణ చేపడతామని, ఉచిత బస్సు ప్రయాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారని, ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బండారు బులితాత, చీకట్ల అబ్బు, కడియం చిన్నా, తమ్మన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కట్టుంగ పంట కాలువకు గండి

ఆత్రేయపురం, అక్టోబరు 13: ఆత్రేయపురం మండలం కట్టుంగ పంట కాలువకు గండి పడింది. ఈ నేపథ్యంలో సాగునీరు వృధాగా పోతోంది. పంట కాలువ కుంగిపోవడంతో కాలువకు గండిపడింది. ఈ కాలువ ద్వారా అంకంపాలెం పంట పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. గండి ఏర్పడటంతో ఆ ప్రాంత రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లాల్సిన సాగునీరు గండి కారణంగా వృధాగా పోతోంది.

మద్యం డీడీల్లో జిల్లాలోనే మొదటిస్థానంలో పి.గన్నవరం

పి.గన్నవరం, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానంలో భాగంగా గతవారం రోజులుగా సాగుతున్న టెండర్ల జాతర ఈనెల 12వ తేదీతో ముగిసింది. ఈక్రమంలో జిల్లాలోనే పి.గన్నవరం మండలం అత్యధికంగా 5 షాపులకుగాను 251 డీడీలతో మొదటిస్థానం సాధించింది. జిల్లా వ్యాప్తంగా 133 మద్యం షాపులకుగాను 4089 డీడీలు నమోదయ్యాయి. పి.గన్నవరంలో 5 షాపులకుగాను ఒక్కొక్క షాపుకు సుమారుగా 50 డీడీలు నమోదయ్యాయి. దీంతో డీడీలు ద్వారా ప్రభుత్వానికి అత్యధికంగా రూ.5.02కోట్లు ఆదాయం వచ్చింది. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత డీడీలకు అధికారులు డ్రా పద్ధతి ద్వారా షాపులు కేటాయించనున్నారు. డీడీలు వేసిన వారికి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటివరకు ప్రభుత్వం పి.గన్నవరం మండలంలో పి.గన్నవరంలో మూడు, వాడ్రేవుపల్లి, ముంగండ, బెల్లంపూడి గ్రామాలలో ఒక్కొక్కటి ఏర్పాటుచేసింది. ఇంకా ప్రభుత్వం మద్యం షాపులకు రెండు రోజులపాటు గడువు ఉన్నప్పటికీ సరుకు లేదని చెబుతూ పలు షాపులు సైతం మూసివేసినట్టు తెలుస్తోంది. నూతన మద్యం షాపులు రావాలంటే మరో రెండు రోజులు పాటు ఆగాల్సిందేనని ఈలోపు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడితే మందుబాబులకు ఇరకాటమే.

రామచంద్రపురం సర్కిల్ పరిధిలో 18 షాపులకు 441దరఖాస్తులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 13:రామచంద్రపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 18 వైన్‌షాపులకు 441 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సర్కిల్ పరిధిలో రాయవరం మండలంలో 4 షాపులకు 117 దరఖాస్తులు, రామచంద్రపురం పట్టణంలో 6 షాపులకు 87 దరఖాస్తులు, మండలంలో 4 షాపులకు 105 దరఖాస్తులు, కె.గంగవరం మండలంలో 4 షాపులకు 132 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.441 దరఖాస్తులు ద్వారా రూ 8.82 కోట్లు జమ అయినట్లు తెలిపారు.

రాజోలు నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, అక్టోబరు 13: రాజోలు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోను మోడల్‌గా అభివృద్ధి చేసి చూపిద్దామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో జరిగిన క్రియా వలంటీర్ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం సమస్యల వలయంలో ఉందని, వాటన్నింటినీ అధిగమించి ముందుకు తీసుకువెళదామని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.11.30 కోట్ల ఖర్చుతో 206 గ్రామీణ సిమ్మెంటు రోడ్లను మూడు నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించిన కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, లింగోలు పెద్దబ్బులు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, గెద్దం మహలక్ష్మి ప్రసాద్, వినిశెట్టి బుజ్జి, జక్కంపూడి శ్రీదేవి, లలితాశివజ్యోతి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఉప్పూడి ఓఎన్జీసీ బాధితులు

కాట్రేనికోన, అక్టోబరు 13: ఉప్పూడి గ్రామస్తులకు ఓఎన్జీసీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై సర్పంచ్ రంబాల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌కు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్టు సర్పంచ్ తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో రంబాల దొరబాబు, రంబాల చౌదరిబాబు, పాపారావు, జొన్నాడ రాజారావు, పోలిశెట్టి నాగబాబు, అర్జునరావు, ఆర్.దొరబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముమ్మిడివరం అక్టోబరు 13: ముమ్మిడివరం మండలం అన్నంపల్లి లక్ష్మీదేవి లంకవద్ద శనివారంరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకవ్యక్తి తీవ్రంగా గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ముమ్మిడివరం ఎస్.ఐ జ్వాలసాగర్ తెలిపిన వివరాల ప్రకారం యానాంకు చెందిన అద్దంకి అప్పారావు(50), అన్నంపల్లి లక్ష్మీదేవిలంకవద్ద బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అప్పారావును అమలాపురంలోవున్న కిమ్స్ ఆసుపత్రికి తరలి స్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూరగాయాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే అప్పారావు మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ తెలిపారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి

కాట్రేనికోన, అక్టోబరు 13: ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లం శివారు గోపాలరావుపేటకు చెందిన అయితాబత్తుల స్వామి మృతి చెందాడు. వెనుక నుంచి వచ్చిన మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో స్వామి అక్కడికక్కడే మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముమ్మిడివరం డీటీగా గోపాలకృష్ణ

ముమ్మిడివరం, అక్టోబరు 13: ముమ్మిడివరం డిప్యూటీ తహసీల్దార్‌గా బిగోపా లకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్, మండపేట డీటీగా బదిలీ అయ్యారు.

జాతీయస్థాయిలో ముమ్మిడివరం సత్తాచాటాలి: ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, అక్టోబరు 11: ఈనెల 14నుంచి 18 వరకు గోవా రాష్ట్రంలో జరిగే నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్ స్టూడెంట్స్ సబ్ జూనియర్ విభాగంలో దొమ్మేటి సాగర్, జూనియర్ విభాగంలో దొమ్మేటి వేణు, మణికంఠ, మేడిది సందీప్, వాసంశెట్టి లవకుమార్, అప్పారి బాలులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్లసుబ్బరాజు అభినందించారు. చిన్నవయస్సులోనే జాతీయస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన వారిని ఆయన అభినందించారు. గోవాలో జరిగే పోటీల్లో పాల్గొని విజేతలుగా ముమ్మిడివరం ఖ్యాతిని ఇనుమడింపచేసి మంచి పేరుతీసుకు రావాలని బుచ్చి బాబు వారిని కోరారు. ఇటీవల కాకినాడలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన కొమ్మిరెడ్డి ధన, యర్రంశెట్టి దత్తలను ఎమ్మెల్యే అభినందించారు. తమ విద్యార్థులు విజేతలుగా నిలవటం ఆనందంగా ఉందని కోచ్ వాసంశెట్టి నరేష్ తెలిపారు.

వంటనూనె విక్రయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం మేరకు అంబాజీపేటలో ఏర్పాటుచేసిన వంటనూనె విక్రయ కేంద్రాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. అంబాజీపేట కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో యువగణపతి ఆలయ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో వంటనూనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో తెల్లరేషన్‌కార్డుదారులకు నెలకు 3 పామాయిల్, 1 సన్‌ఫ్లవర్ ప్యాకెట్లను ఒక్కొక్కటి రూ.110, రూ.124కు అందిస్తారన్నారు. మార్కెట్లో అధిక దరలు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎమ్మెస్వో సత్యనారాయణ, ఆర్ఐ కె.ఏడుకొండలు, కిరాణవర్తక సంఘం కా సు రాజాపండు, వాకపల్లి అనంతబాబు, కంచర్ల వెంకన్నబాబు, గోకవరపు గోపాలకృష్ణ, రవికుమార్, రామారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, అక్టోబరు 13: అప్పనపల్లి బాలబాలజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానికి భక్తులు విరాళాలు అందించారు. ఆదివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్లు ద్వారా రూ.1,59,472లు ఆదాయంగా వచ్చిందని, స్వామివారిని 33,086 మంది దర్శించుకున్నారని సహాయ కమీషనర్ తెలిపారు.